క్లుప్తంగా

ఇంటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ నూర్జహాన్

ఆదోని రూరల్: ఇంటి పన్ను వసూళ్లల్లో పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం చేయరాదని డీఎల్‌పీఓ నూర్జహాన్ సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. హౌస్ ట్యాక్స్ కలెక్షన్, పీఆర్‌–వన్ అప్లికేషన్స్, విక్టర్ కంట్రోల్ హైజీన్, వాటర్ ట్యాంకు క్లీనింగ్, పైపులైన్ లీకేజీలు, మరమ్మతులు, శానిటేషన్‌పై ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ విజయశేఖర్, ఏపీడీ లోకేష్ పాల్గొన్నారు.

నిందితులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో మాల నాగరాజుపై విచక్షణారహితంగా దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ మండల ప్రధాన కార్యదర్శి బి.తిక్కప్ప, మండల ఉపాధ్యక్షులు దావీదు, తాయన్న డిమాండ్ చేశారు. శుక్రవారం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నాగరాజును పరామర్శించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో మొహర్రం సందర్భంగా నాగరాజు తండ్రి రంగప్పను పలువురు కులం పేరుతో దూషించి దాడి చేస్తుండగా అడ్డుపడిన నాగరాజుపై దాడి చేశారని చెప్పారు. గొల్ల వెంకటేష్, కురువ గణేష్, కురువ భీమేష్, బోయ ఉరుకుందుపై ఇస్వీ పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇచ్చినా ఇప్పటికీ కేసు నమోదు చేయలేదన్నారు. ఇప్పటికైనా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు విడుదల చేయండి

ఆదోని అర్బన్: పట్టణశివారు కొండలో వెలిసిన రణమండల ఆంజనేయస్వామి దర్శనానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం కొండ మార్గంలో రోడ్డు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి సంబంధిత అధికారులకు విన్నవించారు. శుక్రవారం కర్నూలులో జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, టూరిజం శాఖ జిల్లా అధికారి విజయకు వినతి పత్రం అందజేశారు. ఇందుకు వారు సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే.. పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు సహకారం అందించాలని పరిశ్రమలశాఖ మంత్రి టి.జి.భరత్‌ను కోరారు. జెడ్పీ సమావేశం అనంతరం మంత్రిని కలిసి ఆటోనగర్ ఆవశ్యకత గురించి వివరించారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో వసతుల కల్పన కోసం, గ్రామాల అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాకు విన్నవించారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

దేవనకొండ: స్థానిక పోలీస్ స్టేషన్‌లో మే 28న నైట్ డ్యూటీ విధులు ముగించుకుని ఇంటికెళ్లిన హోంగార్డు శ్రీనివాసులు గుండెపోటుకు గురై మృతి చెందాడు. దీంతో ఆయన కుటుంబానికి అండగా నిలవాలని పోలీసు, హోంగార్డు సిబ్బంది తమవంతుగా రూ.1,26,000 సేకరించారు. ఈ మొత్తాన్ని పత్తికొండ డీఎస్పీ కె.శ్రీనివాసులు చేతుల మీదుగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం మృతుడి కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. సాయం అందించిన పోలీసు సిబ్బందికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

22నుంచి శిక్షా సప్తాహ్

తుగ్గలి : జాతీయ విద్యా విధానం ప్రవేశపెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 22 నుంచి 28వ తేదీ వరకు శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు నిర్వహించాలని ఎంఈవో–2 రామవెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 22వ తేదీ నుంచి ఉపాధ్యాయులు స్థానిక వనరులతో బోధన అభ్యసన సామగ్రి తయారు చేసి ప్రదర్శించాలన్నారు. 23న పునాది అభ్యసన, సంఖ్యా శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా అమలు చేసేందుకు అవగాహన కల్పించాలని సూచించారు. 24న విద్యార్థులకు క్రీడా పోటీల నిర్వహణ, 25న సాంస్కృతిక కార్యక్రమాలు, 26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం, 27న పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాలు, 28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం నిర్వహించాలని చెప్పారు.

ధ్రువ పత్రాలు అందజేయండి

మద్దికెర : కౌలు రైతులు కౌలు కార్డుతో పాటు మరిన్ని ధ్రువపత్రాలు జతపరచాలని ఏఓ రవి శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వీఆర్వో లేదా రైతు సేవా కేంద్రంలో కౌలు కార్డు పొందాలన్నారు. పొలం యజమాని ఆధార్, పొలం పాస్‌బుక్ జిరాక్స్, 1బీ జిరాక్స్, కౌలు అగ్రిమెంట్, కౌలు రైతు ఆధార్, ఫొటో వ్యవసాయ అధికారులకు అందజేయాలని సూచించారు.

మేధోశక్తికి పదును

విద్యార్థుల్లో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, కేంద్ర శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్తంగా ఏటా ఇన్‌స్పైర్ అవార్డులు అందజేస్తున్నాయి. జాతీయ స్థాయిలో ఉత్తమ ఆవిష్కర్తలను ప్రభుత్వం నగదు బహుమతులతో సత్కరిస్తుంది. ప్రతిభ చూపిన విద్యార్థుల ఉన్నత చదువులు పూర్తయ్యేంత వరకు స్కాలర్‌షిప్ కూడా ఇస్తుంది. అభ్యాసకుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇది చక్కటి వేదికగా ఉపయోగపడుతుంది. ఈ ఏడాది పోటీలకు దరఖాస్తులను ఆహ్వానిస్తోంది.

- ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం
- ప్రతిభ చూపిన విద్యార్థులకు అవార్డు, రివార్డు అందజేత
- జాతీయస్థాయిలో రాణిస్తే చదువులు పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్
- 6–10వ తరగతి విద్యార్థులు అర్హులు
- సెప్టెంబర్ 15వరకు అవకాశం



ఆదోని నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు, అధికారులు (ఫైల్)

ఆదోని సెంట్రల్: విద్యార్థుల మేధస్సును పెంపొందించేందుకు, నూతన ఆవిష్కరణలవైపు వారిని పురిగొల్పేందుకు ప్రభుత్వం ఇన్‌స్పైర్ మనక్ పోటీలను నిర్వహిస్తుంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించేందుకు ఇది వేదికగా ఉపయోగపడుతుంది. ఈ పోటీలను 2009 నుంచి ప్రారంభించింది. ఈ పోటీల్లో శాస్త్ర, సాంకేతిక పద్ధతిలో సమాజానికి ఉపయోగపడేలా ఆవిష్కరణలు చేయాల్సి ఉంటుంది. అందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు రూ. 10వేలు నగదు బహుమతిని అందిస్తారు. సైన్స్ సంబంధిత ప్రాజెక్టుతో జాతీయస్థాయి వరకు నిర్వహించే పోటీల్లో పాల్గొనవచ్చును. విద్యార్థి ప్రదర్శించిన ప్రాజెక్టు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయికి ఎంపికైతే నగదు బహుమతులను అందిస్తారు. ప్రతిభ చాటిన విద్యార్థుల ఉన్నత చదువులు పూర్తియ్యేంత వరకు స్కాలర్ షిప్‌ను కేంద్ర ప్రభుత్వం తోడ్పాటుతో అందిస్తారు.

పోటీలు ఇలా..

ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పోటీలను ఏటా రాష్ట్ర, జాతీయ, జిల్లా స్థాయిలో నిర్వహిస్తున్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న మేధోశక్తికి పదును పెట్టేలా ప్రోత్సహిస్తుంది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్‌టీ) అధ్వర్యంలో జరిగే పోటీలకు రాష్ట్రం,జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 2, ప్రాథమిక ఉన్నత పాఠశాల 3 సైన్స్ ప్రాజెక్టులను ఆవిష్కరించేలా విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉంటుంది. 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారు పోటీలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. ప్రతి పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొనేలా చూడాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 15వ తేదీ వరకు అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. విజ్ఞాన, శాస్త్ర సాంకేతిక రంగాలపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన పెంచేలా నమూనాలు చేయాల్సి ఉంటుంది. ప్రయోగాలు కూడా సృజనాత్మకత, నూతనత్వంతో కూడిన పర్యావరణ హితమైన, సామాజిక, సమస్యలకు పరిష్కారం చూపించేలా ఉండాలి. పోటీల్లో పాల్గొనదలిచిన వారు తమ ప్రాజెక్టు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటిన వారు రాష్ట్ర స్థాయిలోను పాల్గొంటారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటిన వారు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుంది. జాతీయ స్థాయిలో ఎంపికైన విద్యార్థులను బాల శాస్త్రవేత్తలుగా గుర్తించి రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందజేస్తారు.

దరఖాస్తు విధానం..

ఇన్‌స్పైర్ మనక్ అవార్డులకు సంబంధించిన ప్రాజెక్టు వివరాలను పాఠశాల ఐడితో గడువులోపు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. విద్యార్థులు నమోదు చేసిన దరఖాస్తు సంబంధిత జిల్లా అధికారులకు చేరుతుంది. అమోదించిన దరఖాస్తును దరఖాస్తుదారుడు ఇచ్చిన ఈ–మెయిల్ ఐడీకి యూజర్ ఐడీతో కూడిన లింక్ వస్తుంది. ఐడీకి పాస్‌వర్డ్ క్రియేట్ చేసుకోవాలి. అనంతరం విద్యార్థికి సంబంధించిన వివరాలను నమోదు చేయాలి. నామినేషన్ కసరత్తు పూర్తయిన తర్వాత పోటీల ప్రదర్శన ఉంటుంది. పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపికైన వారికి రూ.10 వేలు, రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారికి రూ.40 వేలు, జాతీయ స్థాయికి ఎంపికైన వారికి రూ.60 వేలు నగదును బహుమతిగా విద్యార్థి అకౌంట్‌లో జమ చేస్తారు.

ప్రతిభను వెలికితీయొచ్చు



ఇన్‌స్పైర్ మనాక్ పోటీల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయవచ్చు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభం వచ్చేలా వారికి అవగాహన కల్పిస్తే భావిత రాలకు మంచి శాస్త్రవేత్తలను అందించిన వారవుతాం.. బాల్యంలోనే శాస్త్ర సాంకేతిక రంగాలపై విద్యార్థులకు అవగాహన కలుగుతుంది. ప్రయోగాలు చేసే ప్రతి ప్రాజెక్టులో ఆలోచనతో చేసేలా వారిని పురిగొల్పాలి. అప్పుడే వినూత్న ఆలోచనలతో ప్రాజెక్టును పూర్తి చేయగలుగుతారు.

– సుధాకర్, సైన్స్ ఉపాధ్యాయుడు

ప్రతి పాఠశాల నుంచి నామినేషన్ ఉండాలి



ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రభుత్వం ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రతి ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల నుంచి నామినేషన్‌ను తప్పకుండా దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ దాఖాలు చేయడానికి సెప్టెంబర్ 15వ తేదీ వరకు సమయం ఉంది. ప్రతి పాఠశాలలోని సైన్స్ ఉపాధ్యాయులు ప్రాజెక్టుల ఆవిష్కరణకు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. మనం ఇచ్చే ప్రయోగాలు పర్యావరణహితంగా ఉంటూ సమాజానికి ఉపయోగపడేలా ఉండాలి. ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందుతుంది.

– వెంకటరమణారెడ్డి, డిప్యూటీ ఈఓ, ఆదోని

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మిగనూరుటౌన్: వర్షాలు కురుస్తున్నందున ప్రజలు,రైతులు విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ప్రమాదం జరిగే అవకాశం ఉందని విద్యుత్ శాఖ డీఈఈ రాఘవేంద్ర హెచ్చరించారు. శుక్రవారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ సమస్యలొస్తే దగ్గరలోని తమ శాఖ సిబ్బందికి తెలియజేయాలని, సొంతంగా విద్యుత్ పనులు చేయొద్దని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి వెళ్లొద్దని, విద్యుత్ సంబంధిత ఫ్యూజులు సొంతంగా వేసుకొనే ప్రయత్నం చేయొద్దని చెప్పారు. విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రైవేట్ వ్యక్తులు ఎక్కకూడదని, ఏ సమస్య ఉన్నా విద్యుత్ శాఖ సిబ్బందికే తెలియజేయాలని చెప్పారు.

విద్యుత్ ప్రమాదాలు నివారణకు సహకరించాలి

పెద్దకడబూరు : వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలని విద్యుత్ ఏఈ ఆర్‌బీవీ సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు వైర్లు, స్విచ్‌లు, బోర్డులు మొదలయినవి నాణ్యమయినవి ఉపయోగించాలన్నారు. వర్షాలు పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాలను తాకరాదన్నారు. అదేవిధంగా తడి చేతులు, తడి కాళ్లతో స్విచ్చ్‌లు ఆన్ చేయడం లేదా బంద్ చేయడం వంటివి చేయరాదన్నారు.కరెంట్‌కు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం సంబంధిత విద్యుత్ సిబ్బందిని మాత్రమే సంప్రదించాలన్నారు.

సాతనూరులో ఇరు వర్గాల ఘర్షణ

- ఇద్దరికి గాయాలు



గాయాలు చూపుతున్న బాధితుడు నజీర్

కోసిగి: మండల పరిధిలోని సాతనూరు గ్రామంలో శుక్రవారం నమాజు చేస్తున్న ఇద్దరిపై అదే గ్రామానికి చెందిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వక్ఫ్‌బోర్డు మాజీ ముతవల్లి ముల్లా కాశీమ్ గతంలో ఊరిలోని వక్ఫ్ భూమిని తన ఆధీనంలో పెట్టుకుని సాగుచేసుకునేవాడు. అయితే ఈ ఏడాది అధికారికంగా అదే గ్రామానికి చెందిన 20 మంది జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యాలయంలో జరిగిన వేలం పాటలో పాల్గొని సాగుకు లీజు పొందారు. తన ఆధీనంలోని భూమిని దక్కించుకున్నారనే కక్షతో నజీర్, నవాజ్ అనే వ్యక్తులపై మాజీ ముతవల్లి ముల్లా కాశీమ్ కుమారులు ఖాజా, రైమత్ వలి, జిలాని, అబ్దుల్ కర్రలతో దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆదోని ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. వీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రేపు గురుపౌర్ణమి



సాయి బాబా

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఉరుకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో ఈనెల 21వ తేదీన గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు సాయి రుత్విక్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండురంగ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ వేడుకల్లో భాగంగా ఉదయం సుప్రభాతం, అభిషేకములు, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు, విరాట్ సాయి స్తోత్ర పఠనం, నిత్య ప్రార్థన పఠనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నా సాయి చిత్ర పటం ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

కాటికాపర్ల సంఘం నాయకుడి మృతికి సంతాపం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న కేవీపీఎస్ నాయకులు

కోసిగి: మండల పరిధిలోని దుద్ది గ్రామానికి చెందిన కాటికాపర్ల సంఘ నాయకుడు రామన్న (56) గుండెపోటుకు గురై శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న కేవీపీఎస్ మండల కార్యదర్శి హనుమంతు, ముక్రన్న, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి సంతాపం తెలిపారు. ఆయన అంత్యక్రియల నిమిత్తం కుటుంబసభ్యులకు రూ.2వేలు అందించారు. మృతిడికి భార్య బుజ్జమ్మ, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

దివ్యాంగులకు భరోసా కల్పించాలి



దివ్యాంగులకు బిస్కెట్స్ అందజేస్తున్న కల్పన

ఆదోని సెంట్రల్: దివ్యాంగులకు భరోసా కల్పించాలని, వారిని చిన్నచూపు చూడరాదని సమగ్రశిక్ష రాష్ట్ర ట్రైనింగ్ ప్రోగ్రాం అధికారి కల్పన శైల అన్నారు. శుక్రవారం స్థానిక భవిత కేంద్రాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి సేవా కార్యక్రమాలు అందిస్తున్నారు, వాటిని దివ్యాంగులు ఎలా సద్వినియోగం చేసుకుంటున్నారు అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. భవిత కేంద్రంలోని రికార్డులను పరిశీలించారు. శారీరక, మానసికంగా నలిగిపోతున్న పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయతలు కలిగి వారిని నడిపించాలని ఐఈఆర్టీ ఉపాధ్యాయులకు సూచించారు. ఎంఈఓ–2 శ్రీనివాసులు, సమగ్ర సెక్టోరియల్ ఆఫీసర్ సురేష్, ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు శాంతకుమార్, మౌలిక పాల్గొన్నారు.

భవిత కేంద్రంతో దివ్యాంగులకు ఉపయోగాలు

ఎమ్మిగనూరుటౌన్: దివ్యాంగ చిన్నారులకు భవిత కేంద్రంలో చేర్పించడం ద్వారా ఎన్నో ఉపయోగాలున్నాయని రాష్ట్ర సమగ్ర శిక్ష అధికారి కల్పన పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్‌లోని భవిత కేంద్రంలో రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. రోటరీ క్లబ్ అధ్యక్ష,కార్యదర్శులు నట్‌రాజ్ రెడ్డి, సుధాకర్‌రావు, సభ్యులు కేఆర్ నరసింహారెడ్డి, యోగా గురువు ప్రభాకర్‌రెడ్డితో కలిసి దివ్యాంగులకు పండ్లు, బిస్కెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు షఫీవుల్లా, శివకుమార్,బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరీగా కన్యకాపరమేశ్వరి

ఆస్పరి: స్థానిక వాసవీమాత ఆయలంలో కన్యకా పరమేశ్వరి శుక్రవారం శాకాంబరీ అలంకారంలో దర్శనమిచ్చారు. అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి కూరగాయలు, ఆకు కూరలు, వివిధ రకాల పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

కార్యకర్తలకు అండగా ఉంటా

- మండల నాయకుల సమావేశంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

మంత్రాలయం : పార్టీ కోసం శ్రమించిన ప్రతి నాయకుడికి, కార్యకర్తకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి భరోసా ఇచ్చారు. శుక్రవారం మండలంలోని రాంపురం గ్రామంలో రామలింగేశ్వర స్వామి కళ్యాణ మండపంలో సీనియర్ నేత వై. సీతారామిరెడ్డితో కలిసి మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మంత్రాలయ నియోజకవర్గ ప్రజల ఆశీస్సులతో నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచానని చెప్పారు. తన పై నమ్మకంతోనే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని పేర్కొన్నారు. టీడీపీ నాయకుల అరచకాలు, బెదిరింపులకు అధైర్య పడవద్దని చెప్పారు. టీడీపీ నాయకుల దందాలు మితిమీరిపోయాయని ఆరోపించారు. రాబోయే రోజుల్లో టీడీపీ వైఫల్యాలపై సమిష్టిగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు భీమా రెడ్డి, మండల ఇన్‌చార్జ్ విశ్వనాథ్ రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు రఘునాథ్ రెడ్డి, లీగల్ సెల్ అడ్వైజర్ గురురాజ రావు, నాయకులు రాఘవేంద్ర, జనార్ధన్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టును సందర్శించిన ఐఆర్ఎస్ అధికారులు



గాజులదిన్నె ప్రాజెక్ట్ వద్ద ఇంజనీరింగ్ అధికారులతో చర్చిస్తున్న ఐఆర్ఎస్ అధికారులు, జేసీ

గోనెగండ్ల: జిల్లాలో ఏకైక మధ్యతరహా ప్రాజెక్టు అయిన గాజులదిన్నె ప్రాజెక్టును శుక్రవారం ఐఆర్ఎస్(ఇండియన్ రెవెన్యూ సర్వీస్) అధికారి చిత్తరంజన్ దాస్, జిల్లా జాయింట్ కలెక్టర్ నారపు రెడ్డి మౌర్య, సైంటిస్ట్ విజయ్ కేతన్ సందర్శించారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం, ప్రస్తుతం ప్రాజెక్టులో ఎంత నీరు నిల్వ ఉంది, ఎన్నివేల ఎకరాలు సాగు అవుతుంది, ఏ సీజన్‌లో రైతులకు నీరు అందజేస్తారు తదితర విషయాలను ప్రాజెక్టు డీఈ విజయ్ కుమార్, ఏఈ ఆలీని అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఆరు క్రస్ట్ గేట్లకు గాను మూడు గేట్లు పనులు పూర్తి అయ్యాయి మిగత మూడు గేట్ల పనులు త్వరలో పూర్తి చేస్తామని డీఈ అధికారులకు తెలిపారు. జీడీపీ ఆనకట్ట ఎత్తు పెంచితే ఎన్ని టీఎంసీలు అదనంగా చేరుతుందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతలను వారు పరిశీలించారు. అలాగే ఐరన్‌బండ గ్రామంలో జలజీవన్ మిషన్ కింద చేపట్టిన ఇంటింటి కుళాయి పనులను వారు పరిశీలించారు. అనంతరం ఐరన్ బండ గ్రామస్తులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో జలజీవన్ మిషన్ కింద పైపు లైన్ వేశామని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ కూడా ఇవ్వడం జరిగిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. నీటి సమస్య ఉందని గ్రామస్తులు విన్నవించగా స్పందించిన జేసీ నారపు రెడ్డి మౌర్య రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీడీ అమర్‌నాథ రెడ్డి, ఎంపీడీఓ సోనిబాయి, ఆర్ఐ సుబ్బారెడ్డి, ఏపీడీ అల్లీపీరా, ఏపీఓ మహమ్మద్ బాషా, ఏఓ హేమలత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కోలుకోలేక యువకుడు మృతి

ఆదోని అర్బన్: మండలంలోని నాగలాపురం గ్రామ సమీపంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఉదయ్ (20) అనే యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. తాలూకా ఎస్ఐ ఎర్రిస్వామి తెలిపిన వివరాల మేరకు.. ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఉదయ్ తన స్నేహితుడితో పాటు బైకుపై ఆదోనిలోని అమ్మమ్మను కలిసేందుకు వచ్చారు. తిరిగి ఎమ్మిగనూరుకు వెళ్లే క్రమంలో స్నేహితులిద్దరూ వేర్వేరు బైకులపై వెళ్తుండగా నాగాలాపురం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఉదయ్ బైకును ఢీ కొట్టింది. వెంటనే స్నేహితుడు ఆదోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం వైద్యులు కర్నూలుకు రెఫర్ చేశారు. కర్నూలులో కోలుకోలేక ఉదయ్ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కర్నూలు నుంచి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారని ఎస్ఐ వివరించారు.

పంట నష్ట పరిహారం అందించాలి

ఆదోని రూరల్: 2023లో పంటలు నష్టపోయిన రైతులకు చెల్లించాల్సిన పరిహారాన్ని వెంటనే అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న, మండల కార్యదర్శి రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని కుప్పగల్, దొడ్డనగేరి, మాంత్రికి, పెద్దతుంబళం, పెద్దహరివాణం, సంతెకూడ్లూరు గ్రామాల్లోని సచివాలయాల ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం సచివాలయాల అధికారులకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఉపాధి బిల్లులను మంజూరు చేయాలని, అందరికీ ఉపాధి పనులు కల్పించాలని కోరారు. సంఘం మండల అధ్యక్షుడు శేఖర్, కేవీపీఎస్ మండల కార్యదర్శి తిక్కప్ప, వెంకటేష్, కమలనాథ్, గోపాల్, కర్ణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించొద్దు



సుళేకేరిలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

కౌతాళం: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని మండల ప్రత్యేక అధికారి కేవీఎస్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఏరిగేరి, ఉరుకుంద, కామవరం, చిరుతపల్లి, మల్లనహాట్టి గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. తాగునీరు సక్రమంగా అందుతుందా లేదా అని ఆయా గ్రామాల ప్రజలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాల్లో రికార్డులను పరిశీలించి క్లోరినేషన్‌పై ఆరా తీశారు. కాగా ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తా సుళేకేరి, పొదలకుంట వివిధ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ప్రకటించాలి

ఆదోని సెంట్రల్: ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్‌ను ప్రకటించాలని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు పి.నాగేంద్రప్ప కోరారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యలయంలో నాయకుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ–2024 ద్వారా ఉపాధ్యాయులను నియమించే లోపు బదిలీలు జరపాలన్నారు. వివిధ వ్యక్తిగత, ఆరోగ్య, కుటుంబ కారణాల వల్ల అనేక మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శ్రీనివాసులు, కాశీ విశ్వనాథ శాస్త్రి, నారాయణ పాల్గొన్నారు.

అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు

పెద్దకడబూరు : ప్రభుత్వ అనుమతులు లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తప్పవని మండల విద్యాధికారి రామమూర్తి హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎలాంటి అనుమతులు లేకుండా కొన్ని పాఠశాలలు విద్యార్థులను చేర్చుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. త్వరలో వాటిని గుర్తించి మూసివేస్తామన్నారు. అదేవిధంగా అనుమతి పొందిన కొన్ని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థులకు కనీస వసతులు కల్పించడం లేదన్నారు. ఇలాంటి వాటిని సైతం పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.